విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

అటవీ హక్కుల చట్టాన్ని నిర్వీర్యం చేసిన మోడీ

– వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: కేంద్రంలో అధికారంలో వున్న మోడీ ప్రభుత్వం గిరిజనులు పోరాడి సాధించుకున్న అటవీ హక్కుల సంరక్షణ చట్టాలను నిర్వీర్యం చేసిందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ తీవ్రంగా మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అల్లూరి సీతారామరాజు జిల్లా మొదటి మహాసభలు ఎంపీటీసీ మెంబర్ సిగ్గే సత్యబాబు అధ్యక్షతన కొయ్యూరు మండలం బంగారపేట గ్రామంలో జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గిరిజనులు అధికసంఖ్యలో వున్నారని వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. రేషన్ కార్డు కావాలంటే పెళ్లి అయినట్లు సర్టిఫికెట్ కావాలని గిరిజనులను అడగడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. గిరిజనులు పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధరలు లేక దళారీల చేతుల్లో మగ్గి పోతున్నారని అన్నారు. గిరిజనులు పండించే పంటలు నిల్వ ఉంచుకోవడానికి కోల్డ్ స్టోరేజ్‌లు ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. రోడ్లు సదుపాయాలు సక్రమంగా లేనందువలన డోలీ మోతలు తప్పడం లేదన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు బాపట్లలో సెప్టెంబర్ 25, 26, 27 తేదీల్లో జరగనున్నాయని, మొదటి రోజు 25వ తేదీ 10 వేల మందితో మహా ప్రదర్శన, భారీ బహిరంగసభలు వుంటాయని తెలిపారు.

ఈ సమావేశంలో అల్లూరి సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, అనకాపల్లి జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శివలంక కొండలరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, సత్యబాబు, చింతపల్లి ఎంపీటీసీ మెంబర్ సిగ్గే సత్యబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు సింహాచలం, పేట్ల పోతురాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. జిల్లా గౌరవ అధ్యక్షులుగా కమిడి సింహాచలం, అధ్యక్షులు వియ్యపు నానాజీ, జిల్లా కార్యదర్శి సిగ్గే సత్యబాబు (ఎంపీటీసీ)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మున్సిపాలిటీ స్థలం కాదు.....ప్రైవేట్ స్థలం...!

కమిషనర్‌ను తప్పుదోవ పట్టిస్తున్న జోనల్ అధికారులు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: అనకాపల్లి, గాంధీనగరం, మిరియాల కాలనీ టౌన్ సర్వే నెంబర్ 348లోని మున్సిపల్ స్థలం కబ్జాకు గురవుతుందని దానిని స్వాధీనం చేసుకొని విశాఖ గ్రంథాలయం తరహాలో బహుళ ప్రయోజనకారి పౌర గ్రంథాలయాన్ని నిర్మించాలని కోరుతూ వామపక్ష పార్టీల తరపున జీవీఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్, అనకాపల్లి జోన్ అధికారులకు 2023 జూన్ 19వ వినతిపత్రాలు ఇచ్చినట్లు సీపీఎం సీనియర్ నాయకులు ఎ.బాలకృష్ణ, సిపిఐ ఎంఎల్ (లిబరేషన్) జిల్లా కన్వీనర్ పీఎస్.అజయ్ కుమార్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. విచారణ జరపమని, విచారణలో పాల్గొనడానికి తమకు నోటీసులు ఇవ్వాలని కూడా కోరినట్లు తెలిపారు. కాని నేటి వరకు ఎలాంటి విచారణ జీవీఎంసీ చేపట్టకుండా అక్కడ నిర్మాణాన్ని కూడా ఆపలేదన్నారు. మిరియాల కాలనీలోని మున్సిపల్ స్థలంలో మున్సిపల్ ఉద్యగుల కోసం హౌసింగ్ కార్పొరేషన్ సహకారంతో ఎల్ఐజి (లోవర్ ఇన్ కం గ్రూప్) కాలని ఒకటి కట్టారని, అందులో కట్టిన గృహాలు ఒక్కొక్కటి 60 చదరపు గజాలకు (48 చదరపు గజాలు ఒక సెంటు) మించి వుండదని, కాని తమకు అక్కడ 11 సెంట్లు భూమి (532 చదరపు గజాలు) వున్నట్లు, 2013లో మాజీ మున్సిపల్ ఉద్యోగి కుటుంబ సంభ్యులు 53 లక్షలకు అమ్మివేసారన్నారు. ఈ అమ్మకం, అందులో మున్సిపల్ ఉద్యోగుల పాత్రపై విచారణ జరపాలని కోరుతూ అవినీతి నిరోధక శాఖకు ఇప్పటికే వినతిపత్రాలు ఇచ్చినట్లు తెలిపారు. జీవీఎంసీ కమిషనర్, జిల్లా కలెక్టర్‌లు గాంధి నగరం ప్రభుత్వ భవనాలు, స్థలాలను పరిశీలించారని, కళ్ళ ముందే వున్న జీవీఎంసీ ఆక్రమిత స్థలం వైపు కన్నెత్తి చూడలేదన్నారు. తమ ఫిర్యాదుపై జీవీఎంసీ తీసుకున్న చర్యలను గూర్చి సమాచారం హక్కు చట్టం ద్వారా ఈనెల 21న జవాబు ఇస్తూ 563.31 చదరపు గజాల భూమి ప్రైవేటు భూమి అని జవాబు ఇచ్చారన్నారు. (దొంగ క్రియ దస్తావేజులలో వున్నది 532 చదరపు గజాలు) అని, ఫిర్యాదు చేసిన వారికి ఎటువంటి నోటీసులు ఇవ్వలేదని జవాబులో అంగీకరించారన్నారు. 60 చదరపు గజాల ఎల్ఐజి (లోవర్ ఇన్ కం (గ్రూప్) ఇంటిని చూపి 11 సెంట్లు మున్సిపల్ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడంలో జీవీఎంసీ అనకాపల్లి జోన్ అధికారుల పాత్ర వుందని రుజువైందన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో అనకాపల్లి జోన్ కమిషనర్, పట్టణ ప్రణాళిక అధికారుల అధికార దుర్వినియోగంపై విచారణ కోరుతూ లోకాయుక్త వద్ద కేసు దాఖలు చేసామన్నారు. జోనల్ అధికారులు జీవీఎంసీ కమీషనర్‌ను తప్పుదోవ పట్టిస్తున్నారని, లోకాయుక్త ముందుకు కమీషనర్ రావలసి ఉంటుందని ప్రకటనలో పేర్కొన్నారు.

పూలుగూడ వరకు బీటీ రోడ్డు నిర్మించాలి

విశాలాంధ్ర - అనంతగిరి: టోకూరు పంచాయతీ బొర్ర మెయిన్ రోడ్డు పూల మామిడి చెట్టు నుండి బలియగుడ కొత్తవలస మీదుగా బొర్ర పంచాయతీ పూలుగూడ వరకు బీటీ రోడ్డు మంజూరు చేయాలని టోకూరు సర్పంచ్ కిల్లో మోస్య, సీపీఎం నాయకులు గెమ్మెల దేవన్న, గెమ్మెల భీమరాజు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. గతంలో గిరిజన సంక్షేమ శాఖ ద్వారా మట్టి రోడ్డు వేసి జీ ఎస్పీ వేయకుండానే సుమారు 22 లక్షలు బిల్లులు మార్చుకున్నారని, పంచాయతీ రాజ్ శాఖ ద్వారా గత సంవత్సరం స్వయానా అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ వచ్చి శంకుస్థాపన చేశారని, ఇప్పటికీ ప్రారంభం కాలేదని తెలిపారు. ఈ మాజీ వార్డు మెంబరు తామల చిన్నయ్య, తామల రమణ పాల్గొన్నారు.

విలేకరిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

విశాలాంధ్ర - పరవాడ: విశాలాంధ్ర విలేకరిపై పెదముసిడివాడ సర్పంచ్ కుమారుడు పల్లా అప్పారావు దాడి చేయడాన్ని జనసేన పార్టీ తీవ్రంగా ఖండించింది. ఆ పార్టీ అనకాపల్లి పార్లమెంటరీ వర్కింగ్ కమిటీ మాజీ సభ్యుడు అర్జిల్లి అప్పలరాజు, పరవాడ గ్రామ కమిటీ సభ్యుడు చుక్క నాగు వేర్వేరు పత్రికా ప్రకటనలు విడుదల చేశారు. ప్రజలకు నిజ నిజాలను తెలియజేయడంలో విలేకరులు ముఖ్య భూమిక పోషిస్తారని, అలాంటి జర్నలిస్టులపైనే దాడికి పాల్పడడం అప్రజాస్వామికం అన్నారు. దాడికి పాల్పడిన వారిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు చూడాలని కోరారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

విశాలాంధ్ర - మల్కాపురం: ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ బోగవిల్లి నాగభూషణం అన్నారు. 40వ వార్డు పరిధి సచివాలయల కన్వీనర్లు గుండపు అశోక్, దండి శ్యామ్, పెంట్లా బాలకృష్ణ, మీసాల సత్యనారాయణ, శరగడం గంగరాజు నేతృత్వంలో కన్వీనర్లు, గృహ సారథులతో ప్రత్యేక సమావేశం జరిగింది. కన్వీనర్లకు, గృహ సారథులకు ఉచిత బీమా పథకం, ప్రజా సమస్యలు పరిష్కారం కోసం ఎలా పని చేయాలన్న దానిపై వివరించారు. ఈ సమావేశంలో వార్డు అధ్యక్షులు వరపల మహేష్, గంటా వర్మ గృహసారథులు పాల్గొన్నారు.

రహదారి ఏర్పాటుతో రైతుల హర్షం

విశాలాంధ్ర - గొలుగొండ: మండలంలో మేజర్ పంచాయతీ ఏఎల్ పురం గ్రామంలో రైతులు వంట పొలాలకు వెళ్లే రోడ్లు ఆక్రమణ కావడంతో రైతులు స్పందనలో ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం డిటి బాలరాజు దొర, వీఆర్వో రాజు రోడ్లను పరిశీలించి రైతులకు ఇబ్బంది లేకుండా రహదారిని ఏర్పాటు చేశారు. దీంతో వ్యవసాయ రైతులు హర్షం వ్యక్తం చేశారు.

పెంటకోటలో స్టాల్ యాక్టివిటీ ప్రోగ్రాం

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని పెంటకోట గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో స్టాల్ యాక్టివిటీ ప్రోగ్రాం నిర్వహించారు. హెచ్ఐవి, సుఖ వ్యాధుల గురించి ఐఇసి పరికరాల ద్వారా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జోనల్ సూపర్‌వైజర్ డి.రమణ, లింక్ వర్కర్ జి.సిహెచ్.నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రయాన్ విజయోత్సవ సంబరాలు

విశాలాంధ్ర - కె.కోటపాడు: చంద్రయాన్-3 విజయవంతమైన నేపథ్యంలో మండలంలోని అనేక పాఠశాలల్లో సంబరాలు నిర్వహించారు. ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులంతా జాతీయ జెండాలతో జయహో భారత్ అంటూ నినాదాలు చేశారు. " ఇస్రో " బృందానికి స్థానిక అయ్యన్న విద్యాసంస్థల తరఫున అభినందనలు తెలుపుతూ ఫ్లెక్సీలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఖాసీం మాట్లాడుతూ ఇస్రో విజయ స్ఫూర్తితో విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాల పట్ల మక్కువ పెంచుకొని రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వి.మాడుగుల: చంద్రయాన్-3 ల్యాండర్ విజయవంతం కావడంతో మాడుగులలో గురువారం అల్లూరి యూత్ క్లబ్, వర్తక సంఘం, భారత నిర్మాణ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున 75 మీటర్ల జాతీయ జెండాతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాడుగుల తహశీల్దార్ వివి.రత్నం, సర్పంచ్ యడ్ల కళావతి, ఉప సర్పంచ్ శ్రీనాథు శ్రీనివాసరావు, వైసీపీ పట్టణ అధ్యక్షులు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, అల్లూరి సీతారామరాజు యూత్ క్లబ్ మండల సతీష్, భారత నిర్మాణ సేవా ట్రస్ట్ గౌరీపట్టపు మహేష్‌కుమార్, పుట్టా మురళీకృష్ణ, జరుగుబిల్లి సుబ్బారావు, పుట్టా బలరాం పాల్గొన్నారు.

నక్కపల్లి: స్థానిక డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులంలో చంద్రయాన్ 3 విజయోత్స వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.యస్.ఆర్.కుమారి ఆధ్వర్యంలో విద్యార్థులు చేసిన ప్రదర్శన అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కుమారి మాట్లాడుతూ చంద్రయాన్-3 ల్యాండింగ్ కోసం ప్రపంచ మొత్తం ఎంతో ఆస్తికరంగా చూసిందని అన్నారు. ఈ విజయానికి శాస్త్రవేత్తలు చేసిన కృషిని ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వి.విజయలక్ష్మి, అధ్యాపకులు యం.జోయ్, రజిత, సుప్రియ, కుమారి, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

హుండీలో చెక్కు కలకలం

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరహాలక్ష్మీనృసింహ స్వామివారి హుండీ లెక్కింపులో రూ.100 కోట్ల చెక్కు కలకలం రేపుతుంది. సింహగిరిపై ఆదాయం లెక్కింపు సమయంలో హుండీలో బొడ్డేపల్లి రాధాకృష్ణ పేరుతో ఉన్న చెక్కును సిబ్బంది గుర్తించారు. స్వామి హుండీ లెక్కింపులో లభ్యమైన రూ.100 కోట్ల చెక్కుపై శ్రీ వరాహలక్ష్మీనృసింహ స్వామి వారి దేవస్థానం అని ఆంగ్లంలో రాసి ఉంది. బొడ్డేపల్లి రాధాక్రిష్ణ పేరుతో సంతకం ఉంది. తేదీ లేకుండా ఉన్న ఈ చెక్కుపై నగదు మొత్తం రాయాల్సిన చోట ముందుగా రూ.10 రాసి కొట్టేసి, దాని పక్కనే రూ.వంద కోట్లు అంకెల్లో వేశారు. అయితే దేవస్థానం వారు తెలిపిన వివరాలు ప్రకారం సదరు చెక్కు అకౌంట్‌లో కేవలం రూ.17లు మాత్రమే ఉన్నాయి. దేవస్థానం వారు ఈ విషయాన్ని తీవ్రంగా ఖండించాలని లేకుంటే ఆకతాయిలు ఇటువంటి పనులు చేసి భక్తుల నమ్మకాన్ని వమ్ము చేయరని నమ్మకం ఏమిటి అని భక్తులు అంటున్నారు.

మాజీ సైనికుడికి కోరాడ పరామర్శ

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం రేవిడి గ్రామానికి చెందిన విశ్రాంత ఆర్మీ సైనికుడైన మోపాడ ఆదినారాయణపై గుర్తు తెలియని వ్యక్తులు హత్యా ప్రయత్నం చేయగా ఆయన తప్పించుకొని హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న పద్మనాభం మండలం వైస్ ఎంపీపీ కోరాడ లక్ష్మణరావు పరామర్శించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని న్యాయం జరిగే వరకు వైసీపీ ప్రభుత్వం అండగా వుంటుందని హామీ ఇచ్చారు.

ఎమ్మార్వో కార్యాలయానికి మెరుగులు

విశాలాంధ్ర - ఆనందపురం: ఎమ్మార్వో లోకవరపు రామారావు చొరవతో తహశీల్దార్ కార్యాలయం నూతనంగా ముస్తాబైంది. ఇదివరకు కార్యాలయానికి ఇరువైపులా పనులకు నోచుకోలేని విధంగా ఉండేది. తరచూ వచ్చే అధికారులు, రైతులు, ప్రజలు చాలా ఇబ్బంది పడేవారు. కార్యాలయానికి మరమ్మతులు చేపట్టాలి నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ దృష్టికి ఎమ్మార్వో తీసుకువెళ్లారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి కలెక్టర్ నిధి నుండి 5 లక్షల రూపాయలు మంజూరు చేశారు.

అలాగే కార్పొరేషన్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ఫండ్స్ మరో 5 లక్షలు మొత్తంగా 10 లక్షలతో మిగతా కొంతమంది దాతల సహాయ సహకారాలతో మరమ్మతులు చేయించారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: గత 13 ఏళ్ల నుండి మండల విద్యా శాఖలో సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఉద్యోగులందరికీ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తక్షణమే క్రమబద్ధీకరించాలని సమగ్ర శిక్ష జిల్లా అధ్యక్షులు మండి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష జిల్లా అధ్యక్షులు మండి అనిల్ కుమార్ మాట్లాడుతూ గత 13 ఏళ్లుగా సమగ్ర శిక్షలో ఉద్యోగులు విద్యాశాఖలో విద్య అభివృద్ధికి కృషి చేస్తున్నామని, సమయానికి జీతభత్యాలు కూడా అందని పరిస్థితి ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరూ విద్య అభివృద్ధికి పూర్తిస్థాయి ఉద్యోగులు లాగా నిరంతరం విద్యాభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తున్నామని తమ సేవలను గుర్తించి రాష్ట్ర ముఖ్యమంత్రి తక్షణమే తమకు క్రమ ఉద్దీకరణ చేసి తమని ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు ఎస్ గౌరీ శంకర్, వి.సురేష్, హరి కాంతమ్మ, సిహెచ్ కామేష్, సూర్యనారాయణ ఈశ్వరరావు, భాస్కరరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సీఎం జగన్ విశాఖలో ట్రాన్సిట్ హాల్ట్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విజయనగరం జిల్లా గజపతినరంలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం శంకుస్థాపన కార్యక్రమం చేయనున్నారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు విశాఖ ఎయిర్ పోర్టుకు చేరుకొని యూనివర్సిటీ శంకుస్థాపనకు ఢిల్లీ నుంచి వస్తున్న కేంద్ర విద్యా శాఖ మంత్రికి సీఎం స్వాగతం పలికిన అనంతరం ఇద్దరు కలిసి హెలికాప్టర్‌లో విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం మరడాం వెళతారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో సమీపంలో ఉన్న చిన్న మేడపల్లిలో యూనివర్సిటీ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం బహిరంగ సభలో పాల్గొని తర్వాత మధ్యాహ్నం మూడు గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకొని ప్రత్యేక విమానంలో గన్నవరం వెళ్తారు. అయితే శుక్రవారం ముఖ్యమంత్రి విశాఖ ఎయిర్పోర్టులో ట్రాన్సిట్ హాల్టు నేపథ్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఏర్పాట్లు చేశారు.

నవరత్నాలతో పేదలకు భరోసా: ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

విశాలాంధ్ర - జి.మాడుగుల: సీఎం జగన్ ప్రవేశపెట్టిననవరత్నాలతో పేదలకు భరోసా కలిగిందని ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని లువ్వాసింగి గ్రామ సచివాలయం పరిధిలోని ఎర్రగుప్ప, లువ్వాసింగి గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. మొత్తం 108 గడపలను సందర్శించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ విజయం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో లువ్వాసింగి సర్పంచ్ కొండపల్లి సుబ్బలక్ష్మి, నాయకులు సత్యనారాయణ, వైస్ సర్పంచ్ గబ్బాడి గణపతి, ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర, మాజీ సర్పంచ్ గబ్బాడి కొండ దొర, నాయకులు కోరాబు ఈశ్వరపడాల్, ఉల్లంగి కర్రిపడాల్, బెదర బంగారురాజు, మండల అధ్యక్షులు సుర్మని మత్స్యకొండం నాయుడు, మండల కన్వీనర్ లంకెల కళ్యాణ్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు సురభంగి రామకృష్ణ, జి.మాడుగుల సర్పంచ్ కిముదు రాంబాబు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

మెనూ అమలులో నిర్వాహకుల నిర్లక్ష్యం

విశాలాంధ్ర - దుంబ్రిగుడ: గిరిజన ఆశ్రమ పాఠశాలలో భోజన మెనూ అమలులో వసతి గృహ నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, దీనికి తోడు ఉన్నత స్థాయి అధికారుల పర్యవేక్షణ లోపంతో వసతి గృహ నిర్వాహకులు ఆడిందే ఆట పాడిందే పాటగా మెనూ ప్రక్రియ జరుగుతుందని పలువురు ఆరోపిస్తు న్నారు. వసతి గృహంలో కొలువుంటూ విద్యను అభ్య సించే విద్యార్థిని, విద్యార్థులకు సంపూర్ణ ఆరోగ్య పౌష్టికా హారంతో పాటు విద్యాబోధనలు పొందాలన్న ఆకాంక్షతో సమూల మార్పుతో రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తుంటే అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోం దన్నారు. మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మెనూ అటకెక్కుతుందని పలువురు చెబుతున్నారు. మండల స్థాయి అధికారులు వారానికి రెండు మూడు రోజులు ఆశ్రమ పాఠశాలలను తనిఖీలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఉన్నప్పటికీ సంబంధిత అధి కారులు తూతూ మంత్రంగా పర్యవేక్షణ చేసి చేతులు దులుపుకుంటున్నారని పలువురు విమర్శిస్తున్నారు. మం డల వ్యాప్తంగా 9 గిరిజన ఆశ్రమ పాఠశాలలు ఉండగా నాలుగు బాలికల ఆశ్రమ పాఠశాలలు, ఐదు బాలుర ఆశ్రమ పాఠశాలలోని 3,154 మంది విద్యార్థిని, విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. ఎక్కడా మెనూ సక్రమంగా లేదన్నారు. ఈ విషయమై ఏటీడబ్ల్యూఓ మల్లికార్జును వివరణ కోరగా గిరిజన ఆశ్రమ పాఠశాలలో పక్కాగా భోజన మెనూ అమలయ్యేలా పర్యవేక్షిస్తామని అన్నారు.

గిరిజన మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: మండలంలోని పెదగూడ పంచాయతీ పరిధిలో గల గలగండ, గత్తుమలడ, బాకుబేడ గ్రామాలలో రాష్ట్ర జిల్లా మత్స్య శాఖ అధికారులు పర్యటించి మత్స్యకారుల జీవన విధానంపై ఆరా తీశారు. స్థానిక సర్పంచ్ బాబురావు ఆధ్వర్యంలో మత్స్య శాఖాధికారులు ఆయా గ్రామాలలో గిరిజన మత్స్యకారులతో పర్యటించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ బాబురావు గిరిజన మత్స్యకారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరించారు. మత్స్యకారులకు ప్రభుత్వం వలలు బోట్లు సకాలంలో అందించినట్లయితే గిరిజన మత్స్యకారులు ఇతర జిల్లాలకు వలస కూలీలుగా వెళ్లే పరిస్థితి ఉండదని అన్నారు. అనంతరం ఫిషరీస్ డెవలప్మెంట్ అధికారి జె సీతారామరాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు గిరిజన మత్స్యకారులకు లైసెన్సులు బీమా సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచ్ బాబురావు మాట్లాడుతూ మత్స్యగెడ్డపై ఆధారపడుతూ గిరిజనులు జీవనం సాగిస్తున్నారని అర్హులైనటువంటి గిరిజన మత్స్యకారులు వలసలు వెళ్లకుండా ఉండాలంటే తక్షణమే వారికి ప్రభుత్వం ద్వారా వలలు, బోట్లు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ టి.గణపతి, మత్స్యశాఖ అధికారులు శ్రీనివాసరావు, ఎల్.వసంత, ఎల్.లీలా ప్రసాద్, వైసిపి నేత కూడా దాసు పాల్గొన్నారు.

ఎట్టకేలకు పాఠశాలకు చేరిన గురుకులం విద్యార్థి

విశాలాంధ్ర కథనానికి స్పందన

విశాలాంధ్ర - పెదబయలు: మండలంలోని గురుకులం పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న శరత్ చంద్ర అదృశ్యం అనే కథనం విశాలాంధ్ర దినపత్రికలో వెలువడిన విషయం పాఠకులకు విధితమే. దీనికి ఏటీడబ్ల్యూఓ స్వర్ణ, పాఠశాల ప్రిన్సిపాల్ శంకరరావులు స్పందించారు. విద్యార్థి శరత్‌చంద్ర శుక్రవారం పాఠశాలకు హాజరైనట్టు తెలిపారు. ఈనెల 7వ తేదీన తన తల్లిదండ్రులతో హౌస్ మాస్టర్ వద్ద పర్మిషన్ తీసుకొని ఆధార్ అప్డేషన్ కోసం గ్రామానికి వెళ్లినట్లు తెలిపారు. ఈనెల 10వ తేదీన పాతని శరత్ చంద్ర తండ్రి పాఠశాల సమీప గేటు వద్ద విద్యార్థిని దింపి తన కుమార్తె ఆరోగ్యం బాగు లేనందున అరకువేలి వెళ్లి వారం రోజులు ఉండిపోవడంతో శరత్ చంద్ర పాఠశాలలో ఉండకుండా గ్రామానికి వెళ్లి ఉండిపోవడం వలన పాఠశాలల్లో తప్పిపోయినట్లు సిబ్బంది గమనించి తమకు ఫోన్ ద్వారా సమాచారం చేరవేయడంతో గురువారం పాఠశాలకు తీసుకువచ్చారని ప్రిన్సిపాల్‌కు శరత్ చంద్ర తండ్రి లిఖితపూర్వకంగా తెలపారని ఆమె తెలిపారు. అయితే విద్యార్థి అదృశ్యం తతంగం ఇంత జరిగినా పూర్తిస్థాయిలో అధికారులు వ్యక్తిగతంగా విచారించడం గాని హౌస్ మాస్టర్‌కి ప్రిన్సిపాల్‌కు విడివిడిగా విచారించడం గాని చేపకట్టకుండానే తూతూ మంత్రంగా విచారణ జరిపి చేతులు దులుపుకున్నారు. మీడియా ప్రతినిధులకు ప్రిన్సిపాల్, హౌస్ మాస్టారు, పాఠశాల సిబ్బంది పొంతన లేని సమాధానాలు ఇవ్వడం జరిగింది. విద్యార్థి ఏ రోజు నుండి పాఠశాల నుంచి తప్పిపోయారు కూడా సంబంధిత అధికారులకే స్పష్టతగా తెలియడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపితే నిజా నిజాలు బయటపడతాయని పలువురు అంటున్నారు.

ఆరుగురు సీఐలకు పోస్టింగ్‌లు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆరుగురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు బదిలీలు చేసి గురువారం పోస్టింగ్‌లను నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రంవర్మ ఇచ్చారు. గోపాల్‌పట్నం లాండ్ ఆర్డర్ సిఐగా పనిచేస్తున్న ఈ. నరసింహారావును హార్బర్ పోలీస్ స్టేషన్ లాండ్ ఆర్డర్ సీఐగా, విఆర్‌లో ఉన్న ఎం.శ్రీనివాసరావును పెందుర్తి లాండ్ ఆర్డర్ సీఐగా, విఆర్‌లో ఉన్న జి.శ్రీనివాసును హార్బర్ పోలీస్ స్టేషన్‌కు క్రైమ్ సీఐగా నియమించారు. విఆర్‌లో ఉన్న జి.అప్పారావుకు సిసిఎస్‌లో పోస్టింగ్ ఇచ్చారు. ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ సిఐగా ఉన్న వి.శ్రీనివాసరావును విశాఖపట్నం సిటీ వీఆర్‌కి పంపగా, ఆయన స్థానంలో విఆర్‌లో ఉన్న ఎస్.విజయ్ కుమార్‌ను ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ సీఐగా నియమించారు.

రహదారి భద్రతపై గీతంలో సదస్సు

విశాలాంధ్ర - మధురవాడ: రహదారి భద్రతపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సును నిర్వహించారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ అమిత్‌భద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ డాక్టర్ జి.సి.రాజారత్నం హాజరై మాట్లాడారు. రహదారి ప్రమాదాలు సామాజిక సమస్యగా మారాయని ప్రతి ఒక్కరి సహకారంతోనే వీటిని తగ్గించ వచ్చునన్నారు. విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగడానికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ బుచ్చిరాజు, గీతం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీనివాస్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ షేక్‌షంషుద్దీన్, సెక్యూరిటీ ఆఫీసర్ రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహాలక్ష్మి అమ్మవారి జాతర

విశాలాంధ్ర - యస్.రాయ వరం: మండలంలో వమ్మవరం గ్రామంలో మహాలక్ష్మి అమ్మవారు జాతర వైభవంగా నిర్వహించారు. గురువారం ఉదయం నుండి చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇటువంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవ కమిటీ ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేశారు. భక్తులకు పలువురు యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రసాదాలు, మంచినీరు పంపిణీ చేశారు. అమ్మవారిని టీడీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక సర్పంచ్ పాలపర్తి పాపారావు, ఎంపీటీసీ బాలం సూరిబాబు, మాజీ ఎంపీటీసీ పల్లెల బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పట్టాలమ్మ తల్లి జాతర

విశాలాంధ్ర - యలమంచిలి: మండలంలోని బయ్యవరం గ్రామంలో ఉన్న పట్టాలమ్మ తల్లి జాతర మహోత్సవాన్ని గురువారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. బయ్యవరంతో పాటు పద్మనాభరాజుపేట, ములకలాపల్లి తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పట్టాలమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. అనంతరం అమ్మవారి ప్రతిమను ఉభయ గ్రామాలైన బయ్యవరం, పిఎస్ఆర్ పేట పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మొగలపల్లి వెంకట సత్యనారాయణ, మాజీ ఎంపీపీ గొన్నాబత్తుల నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ గంజి శ్రీనివాసరావు, గొన్నాబత్తుల శివ, వూటకూటి శేఖర్, మొగలపల్లి గణేష్, చంద్రగిరి శ్రీను, చంద్రగిరి నాని, గెంజి రమణజోగి, పందుల లోవరాజు, గెంజి రాము, నక్కన మహేష్, అడపా శ్రీను, జి.కొండలరావు, జి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రయాన్ - 3 సక్సెస్‌లో గవరవరం యువ శాస్త్రవేత్త

విశాలాంధ్ర - చోడవరం: భారత దేశం ఖ్యాతి నలుమూలలా చాటిన చంద్రయాన్ -3 విజయ పథంలో అనకాపల్లి జిల్లా చోడవరం మండలం గవరవరానికి చెందిన కొమ్మనమంచి భరద్వాజ్ యువ శాస్త్రవేత్త ఒకరు. స్థానిక గవరవరానికి చెందిన కొమ్మనమంచి వెంకటరావు, ఉషల సంతానమైన భరద్వాజ్ 2021 డిసెంబర్‌లో గ్రేడ్ సి శాస్త్రవేత్తగా శ్రీహరి కోట ఇస్రోలో ప్రవేశించారు. చంద్రయాన్ -3 రూపకల్పనలో తమదైన శైలిలో అలుపెరుగని యోధుడిలా అహర్నిశలు శ్రమించి భారత దేశానికి వన్నె తగ్గని కీర్తి గడించిన శాస్త్రవేత్తల బృందంలో కీలక పాత్ర పోషించారు. ఈయన తండ్రి వెంకట రావు (రాజు) ప్రముఖ న్యాయవాది, జిందాల్ కంపెనీలో సౌత్ ఇండియా మేనేజర్‌గా పనిచేస్తున్నారు. మన యువ శాస్త్రవేత్త భరద్వాజ్ ప్రాథమిక విద్యాభ్యాసం చోడవరం విజ్ఞాన్ స్కూల్‌లో జరగ్గా ఉన్నత చదువులు విశాఖ వంటి నగరాల్లో చదువుకున్నారు. ఈ సందర్భంగా గవరవరం గ్రామంలో జెడ్.పి.హై స్కూల్‌లో భరతమాత కు, అంతర్జాతీయ ఖ్యాతి గడించిన భరద్వాజ్‌కు వందనాలు తెలిపారు. అంతేకాక చంద్రయాన్ -3 ప్రయోగంలో ఇస్రో శాస్త్రవేత్తలల్లో ఒకరైన కొమ్మనమంచి భరద్వాజ్ గవరవరం గ్రామస్థుడు కావడంతో గ్రామ ప్రజలు, పాఠశాల సిబ్బంది భరతమాతతో పాటు శాస్త్రవేత్త భరద్వాజ్ కి కూడా సగర్వంగా అభినందనలు తెలియచేశారు. గ్రామపెద్దలు విద్యార్థులకు స్వీట్లు పంచారు. యువ శాస్త్రవేత్త ను అభినందించిన వారిలో తాత కొమ్మనమంచి సత్యనారాయణ, నాన్నమ్మ సీతారామలక్ష్మి, చిన్నాన్న నరసింహ మూర్తి తదితరులున్నారు.

దేవాదాయ శాఖ ఆదేశాలంటే లెక్కలేదు...

విశాలాంధ్ర - గోపాలపట్నం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారి దేవస్థానం అధికారులకు దేవాదాయ శాఖ అధికారులు అంటే లెక్క లేదేమో? ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని భక్తుల వాదన. ప్రైవేట్ సంస్థల ప్రకటనలు గలిగిన బారికేడ్ల, సైన్ బోర్డు లు చూసిన నగరంలో ముఖ్య వ్యాపార సంస్థల అధినేతలు కొంతమంది మాకు అవకాశం ఇస్తే ఇంత కంటే మరింత సేవ చేస్తామని అంటున్నారని సిబ్బంది అంటున్నారు. దేవాదాయ ధర్మాదాయ చట్టం ప్రకారం ఇతర సంస్థల ప్రకటనలు కలిగిన దేనినీ ప్రముఖ దేవాలయాల్లో అనుమతించరు. 2008 వరకు ఈ దేవస్థానంలో ఈఓగా శంకర్ రెడ్డి విధులు నిర్వహించే వారు. అప్పట్లో నాటి నేటి ఓ ప్రముఖ వస్త్ర దుఖాణం యజమాని ఈఓను అయ్యా ఘాట్ రోడ్ అంతటా విద్యుత్ స్థంభాలు వేసి విద్యుత్ దీపాలు విరాళంగా స్వామివారికి ఇస్తామని అయితే ఆ విద్యుత్ స్థంభాలకు మా సంస్థ యొక్క ప్రకటనలతో కలిగిన బోర్డ్‌లు పెట్టుకుంటామని అడుగగా విద్యుత్ స్థంభాలు వేసి విద్యుత్ దీపాలు విరాళంగా ఇవ్వండి కాని ప్రకటనలు కలిగిన బోర్డులకు అనుమతి ఇవ్వమన్నారు. అదేవిదంగా 2011లో అప్పటి ఈఓ దివంగత సి.ప్రేమ్ కుమార్‌కు హెచ్.పి.సి.ఎల్ సంస్థ వారు కొండ క్రింద ఉన్న స్వామివారి ఉద్యాన వనాన్ని సర్వాంగ సుంద రంగా తీర్చి దిద్ది, రెండేళ్ళు నిర్వాహణ (మెయింట్ నెన్స్) చేస్తాము. కాకుంటే మా సంస్థ యొక్క లోగోతో (ముద్ర)ను, సంస్థపేరును పెయింటింగ్ వేయించు కుంటామని ఈఓను కోరగా అందుకు ఆయన ససేమిరా అన్నారు. సింహాద్రి అప్పన్న దేవస్థాన పరిస్థితి ఇంచార్జ్ ఈఓ ఉండటంతో పెద్దదిక్కు లేని ఇల్లులా తయారైందని కొంత మంది సిబ్బంది, అధికారులు, స్థానికులు, భక్తులు అంటున్నారు. ఇటీవల ప్రముఖ బ్యాంక్ సంస్థ పేరుతో బారికేడ్(స్టాపర్లు) ఎలా అను మతించారని ప్రముఖ వస్త్ర, బంగారు దుఖాణాల వ్యాపారులు, చమురు సంస్థల అధికారులు దేవస్థానం అధికారులను అడుగుతుంటే తిరిగి సమాదానం చెప్పలేక మాట దాట వేస్తున్నారని సిబ్బంది, భక్తులు అంటున్నారు.

లోంజా కొండబాబు హఠాన్మరణం విచారకరం

విశాలాంధ్ర - చింతపల్లి: జన్మదినం రోజే మరణం సంభవించడం యాదృచ్ఛికమే అయినప్పటికీ ఆ విధంగా మరణం పొందిన లొంజా తిరుమల వెంకట హరి ప్రసాద్ (కొండబాబు) ధన్యజీవి అని స్థానిక తహశీల్దార్ లత్సా పాత్రుడు అన్నారు. గురువారం తెల్లవారుజామున విశాఖలో గుండెపోటుతో హఠాన్మరణం చెందిన మండలంలోని చౌడుపల్లి గ్రామానికి చెందిన కొండబాబు పార్థివ దేహాన్ని గురువారం చౌడు పల్లిలో ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కొండబాబు పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొండబాబు సోదరులు తిలక్, ఎలక్ట్రికల్ ఎస్ఈ మహేంద్ర నాథ్‌లతో మాట్లాడి, కొండబాబు భార్యాబిడ్డలు, కుటుంబ సభ్యులను ఆయన ఓదార్చారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ మొట్టడం కృష్ణమూర్తి, వీఆర్వో సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - చింతపల్లి: వైకాపా ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న విత్తనాలను సద్వినియోగం చేసుకొని రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవాలని స్థానిక జడ్పీటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య అన్నారు. మండలంలోని కొత్తపాలెం పంచాయతీలో గురువారం ఆ పంచాయతీ సర్పంచ్ వనగల సోమరత్నం ఆధ్వర్యంలో నిర్వహించిన రాయితీ విత్తనాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. వైస్ ఎంపిపి గోపినాయక శారద, సర్పంచ్ సోమరత్నంలతో కలిసి ప్రభుత్వం రాయితీపై అందించిన విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు వనగల బెన్నిబాబు, స్థానిక పంచాయతీ కార్యదర్శి రాజేష్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది, గిరి రైతులు పాల్గొన్నారు.

29న వార్డు మెంబర్ విజయోత్సవ ర్యాలీ

విశాలాంధ్ర - జి.మాడుగుల: మండలంలోని గెమ్మెలి పంచాయతీలో తెలుగుదేశం పార్టీ బలపరిచిన 1వ వార్డ్ మెంబర్ గెమ్మెలి మచ్చమ్మ ఏకగ్రీవంగా ఎన్నికైన శుభ సందర్భాన్ని పురస్కరించుకొని ఈనెల 29న నిర్వహిస్తున్న విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని తెదేపా మండల అధ్యక్షులు వంతల కొండలరావు అన్నారు. ఈ విజయోత్సవ ర్యాలీకి ముఖ్య అతిధిగా తెదేపా పాడేరు నియోజకవర్గ ఇంచార్జి గిడ్డి ఈశ్వరి హాజరు కానున్నారని, ఈ కార్యక్రమానికి తెదేపా శ్రేణులు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమిలి చిట్టిబాబు, క్లస్టర్ ఇంచార్జి సొమెలి రమణ బాబు, మండల ఆర్గనైజేషన్ కమిటీ సభ్యులు కొండపల్లి పిన్నయ్య, మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి లకే రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ కోటారి కొండబాబు, రైతు విభాగం కార్యదర్శి బోయిని బాబురావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి నిత్యావసర సరుకులు అందజేత

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: మండలంలోని చిన్నమట్టపల్లి గ్రామ పంచాయితీ పరిధిలో చింత రేవ్వు పల్లి గ్రామానికి చెందిన గూటాల సీతమ్మ అనే వృద్ధురాలు గత కొంత సం కాలంగా ఆధార్ కార్డు నెంబర్ సాంకేతిక లోపం వలన వృద్ధాప్య పింఛన్ నిలిచి పోయింది. ఆమెకు రోజు పూట గడుపుట చాలా కష్టంగా మారింది. ఆమె కుటుంబం గురించి జీవన స్థితి గతులను గురించి వి.ఆర్.పురం తహసీల్దార్ యన్.శ్రీదర్ తెలుసుకొని మానవతా దృక్పథంతో తన సొంత డబ్బులతో 50 కేజీల బియ్యం నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయం 2 వేలు అందించారు. స్థానిక ప్రజాప్రతినిధులు సర్పంచ్ పిట్ట రామారావు చేతుల మీదుగా పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఎడ్యుకేషన్ సహాయకులు ఎస్. రవి కుమార్, వి.ఆర్పి ప్రసాద్, వలంటీర్లు యం.మీన, యూ.లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

పాల్తేరులో కొత్త పింఛన్ల దరఖాస్తులపై విచారణ

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని పాల్తేరు గ్రామంలో కొత్త పింఛన్లకు దరఖాస్తు చేసుకున్న వారిని మండల పరిషత్ సూపరిండెంటు వర్మ ఇంటింటికి తిరిగి విచారణ నిర్వహించారు. మండలంలో మొత్తం 279 మంది కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో పాల్తేరు గ్రామంలో 38 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి వర్మ విచారణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హుస్సేన్, వెల్ఫేర్ అసిస్టెంట్లు రవి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

పలు చోట్ల వర్షం

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలోని పలుచోట్ల వర్షం కురిసింది గురువారం సాయంత్రం ఆకాశంలో ఒకసారి మేఘాలు ఏర్పడి వర్షం ప్రారంభమైంది. అడ్డరోడ్డు, గోకులపాడు, కొరుప్రోలు, ఎస్.రాయవరం తదితర గ్రామాల్లో వర్షం పడడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. అడ్డురోడ్డులోని వర్షం కురవడంతో రోడ్డుపై నీరు నిలిచిపోయింది.

కంటి విషయంలో జాగ్రత్తలు పాటించాలి

విశాలాంధ్ర - పెదగంట్యాడ: సున్నితమైన కంటి విషయంలో జాగ్రత్తలు పాటించాలని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు అన్నారు. వార్డులోని అశోక్ నగర్ సామాజిక భవనంలో బెస్ట్ విజన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో గురువారం మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పరిశ్రమలు ఉన్న ప్రాంతంలో నివసించే ప్రజలు కంటి విషయంలో జాగ్రత్తలు వహిం చాలని, ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా సంబంధిత వైద్యున్ని సంప్రదించి సలహాలు, సూచనలు తీసుకోవాలని కోరారు. డాక్టర్ పావనీ వాడపల్లి రోగులను పరీక్షించి జాగ్రత్తలు తెలియజేసారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మద్దాల అప్పారావు, లోకనాథం, నాగిశెట్టి శ్రీనివాస్, సంజీవరావు, గౌరీ శంకర్, యడ్ల లక్ష్మీ, అమ్మాజీ, మార్కెటింగ్ హెడ్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న లేగదూడల ప్రదర్శన

విశాలాంధ్ర - మాకవరపాలెం: మాకవరపాలెం మండలం లచ్చన్నపాలెం గ్రామంలో గురువారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన లేగదూడల ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. పాడి రైతులు జెర్సీ, ఒంగోలు, దేశవాళీ తదితర రకాలకు చెందిన 35 లేగదూడలను తీసుకువచ్చారు. ఇందులో మూడు దూడలను ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను పశుసంవర్ధకశాఖ ఏడి సింహాద్రప్పుడు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

బీమా నగదు అందజేత

విశాలాంధ్ర - చోడవరం: లక్ష్మీపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (దామునాపల్లి)లో గురువారం తొమ్మిది మంది సభ్యులకు సంఘం అధ్యక్షుడు శానాపతి సత్యారావు చేతుల మీదుగా బీమా నగదును అందజేశారు. ఒక్కొక్కరికి రూ. 30 వేలు చొప్పున బీమా నగదు అందజేసినట్లు వారు తెలిపారు. అనంతరం అధ్యక్షుడు సత్యారావు మాట్లాడుతూ ఈ ఏడాది 3.5 కోట్లు మేర పంట రుణాలు, రెండు కోట్లు వ్యవసాయేతర రుణాలు అందజేశామన్నారు. 2019- 20 లో వడ్డీ రాయితీ రూ. 4.15 లక్షలు వచ్చిందని, 2022-23కి గాను రూ. 4.80 లక్షలు సంఘానికి లాభం వచ్చినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ కె. శ్రావణ్ కుమార్, సూపర్ వైజర్ జి. రవితేజ, డైరెక్టర్ లు.. తాళపురెడ్డి వెంకట సత్యవీరు నాయుడు, బలిరెడ్డి సత్యారావు, సంఘం సీఈవో జి.వి. సత్యనారాయణ, జాజి మొగ్గల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌మా విత్తనాలు పంపిణీ

విశాలాంధ్ర - అనంతగిరి: టోకూరు పంచాయతీ రైతు భరోసా కేంద్రంలో 200 మందికి సర్పంచ్ కిల్లో మోస్య ఆధ్వర్యంలో రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ ఉషా, మాజీ సర్పంచ్ సారా దొన్ను, సచివాలయ కన్వీనర్ నరాజీ దొన్ను, సీపీఎం నాయకులు గెమ్మెల దేవన్న, టీడీపీ నాయకులు సమర్ది దొన్ను, వాలంటీర్ గెమ్మెల అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాజిల్లాలో యువ గళం పాదయాత్రలో జగదీష్

విశాలాంధ్ర - అనకాపల్లి: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ గన్నవరం నియోజవర్గం వీరవెల్లి నుండి మల్లవెల్లి వరకు జరుగుతున్న పాదయాత్రలో అనకాపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాజీ శాసనమండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు పాల్గొన్నారు. లోకేష్‌తో కలిసి 6 కిలోమీటర్లు పాదయాత్ర చేస్తూ అనకాపల్లి జిల్లా సమస్యలను వివరించానని తెలిపారు. జిల్లాలో జరుగుతున్న సమగ్ర ఓటర్ వెరిఫికేషన్ విషయాలను, తుమ్మపాల వి.వి.రమణ షుగర్ ఫ్యాక్టరీని జిల్లా పరిశ్రమల మంత్రి గుడివాడ అమర్నాథ్ అమ్మకానికి ప్రభుత్వం నుండి జీవో విడుదల చేయించారని దీనిపై రైతులతో కలిసి నేను హైకోర్టును ఆశ్రయించి స్టే తీసుకొచ్చిన విషయాన్ని లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి వివరించానని నాగ జగదీష్ తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో గృహాలను 3400 నిర్మించుగా అందులో 1200 గృహాలు విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గం మంత్రి అసమర్థత వల్ల విశాఖ సామంత రాజుగా విజయసాయిరెడ్డి ఉన్నప్పుడు కేటాయించి అనకాపల్లి లబ్ధిదారులకు అన్యాయం చేశారన్న విషయాన్ని వివరించానని, అలాగే జిల్లాలోని ప్రధాన సమస్యలపై గట్టిగా పని చేయాలని తెలుగుదేశం మినీ మేనిఫెస్టో బీసీలకు రక్షణ, మహిళా శక్తి పథకాలను విస్తృతంగా ప్రచారాలు నిర్వహించాలని లోకేష్ సూచన చేశారని నాగ జగదీష్ తెలిపారు.

కిటకిటలాడిన పూర్ణా మార్కెట్....

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: శ్రావణ 2వ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతం పూజ సామాగ్రి కోసం అధిక సంఖ్యలో మహిళలు పూర్ణ మార్కెట్‌కు తరలి రావడంతో మార్కెట్ ప్రాంతమంతా కిటకిటలాడింది. గురువారం సాయంత్రం ఒక్కసారిగా కురిసిన అకాల వర్షంతో అటు చిరు వ్యాపారులు, ఇటు మహిళలు తీవ్ర ఇక్కట్లు పడాల్సి వచ్చింది. ఓ పక్క పూజా సామాగ్రి ధరలు అధికంగా పలకడంతో మహిళలు పెద్ద ఎత్తున ఆందోళన చెందారు. అరటి పళ్ళు డజన్ 100 రూపాయలు పలకడం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. పువ్వులు, పత్రితో పాటు ఇతర సామాగ్రి ధరలు కూడా అదే స్థాయిలో పలికాయి. ఈ ఏడాది చీరల ధరలతో పాటు బంగారం ధరలు కూడా ఆకాశాన్ని అంటడంతో లక్ష్మీ కాసులు సైతం మూడు వేలకు తక్కువ లేకపోవడంతో అనేకమంది మహిళలు బంగారు దుకాణాల నుండి వెను తిరగాల్సి వచ్చింది.

సంపాదన కన్నా, ధరలు అధికంగా పెరగడంతో కుటుంబ పోషణతో పాటు పండగలు నిర్వహణ కూడా కష్టతరంగా మారిందని మహిళలు అభిప్రాయ పడుతున్నారు. విశాఖ నగరం పరిధిలో ఉన్న అనేక మార్కెట్‌లలో ఇదే సందడి నెలకొంది.

వసతి గృహాల్లో సరుకులు సరఫరాకు టెండర్లు

విశాలాంధ్ర - రంపచోడవరం /దేవీపట్నం: ఏజెన్సీలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యత గల నిత్యావసర సరుకులను తక్కువ ధరకు వేసిన టెండర్లను పరిశీలించి టెండర్లు ఖరారు చేయడం జరుగుతుందని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్ రాజ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలులో రంపచోడవరం డివిజన్ చింతూరు డివిజనల్ పరిధిలో గల 11 మండలాలకు సంబంధించిన గిరిజన ఆశ్రమ పాఠశాలలకు నాణ్యత గల నిత్యావసర వస్తువులు సరఫరా చేయుటకు వెండర్లతో, ఏటీడబ్ల్యూఓలతో, జిసిసి గోదాము ఇన్చార్జిలతో, జిసిసి డివిజనల్ మేనేజర్‌తో, జిసిసి సీనియర్ మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వారి ఆదేశాల మేరకు ఈ టెండర్ల ప్రక్రియ నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. చింతూరు డివిజన్ రంపచోడవరం డివిజన పరిధిలో గల ఆశ్రమ పాఠశాలలకు నిత్యవసర సరుకులు సరఫరా చేయుటకు ఐదుగురు టెండర్లు వేయడం జరిగిందని ఆయన తెలిపారు. రంపచోడవరం చింతూరు డివిజన్ పరిధిలో గల ఆశ్రమ పాఠశాలలకు టెండర్లు ఖరారు అయిన వెండర్లు ఎప్పటికప్పుడు నిత్యవసర సరుకులు ఆశ్రమ పాఠశాలలకు సకాలంలో నిత్యవసర సరుకులు చేరవేసే బాధ్యత ఖరారు అయిన టెండర్‌దారులపై ఉందని అదేవిధంగా టెండర్లు ఖరారు అయిన టెండర్‌దారులు న్యాణ్యత గల నిత్యవసర సరకులు సరఫరా చేయాలని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో ఏటిడబ్ల్యూఓలు కే సుజాత, హాసిని, జిసిసి డివిజనల్ మేనేజర్లు పార్వతీశ్వరరావు, మధు, గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయ పరిపాలన అధికారి బి. కిషోర్, సీనియర్ మేనేజర్లు ముళ్ళ నాగ వెంకట రాజారెడ్డి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా...పదిమందికి గాయాలు



విశాలాంధ్ర - జీకే వీధి: అదుపు తప్పిన ఆటో బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న సుమారు పదిమందికి పైగా గాయపడ్డారు. ప్రాథమికంగా అందిన వివరాల ప్రకారం ఏసుక్రీస్తు సువార్త ప్రవచించడానికి పలువురు పాస్టర్లు, క్రిస్టియన్స్ రెండు ఆటోలలో బయలుదేరి వెళుతుండగా సాగుల, భూసుల గ్రామాల సమీపంలో ఒక ఆటో అదుపుతప్పి బోల్తా పడటతో అందులో ప్రయాణిస్తున్న సుమారు పది మది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన క్షతగాత్రులను హుటాహుటీన జీకే వీధి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంతో స్థానిక వైద్యులు వైద్య సిబ్బంది గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందించారు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను స్థానిక సీఐ అశోక్ కుమార్, ఎస్సై అప్పలసూరి, వైసీపీ మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అరకు ఇర్మియ లు ఆసుపత్రిలో పరామర్శించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు.

ఓఎస్‌జీ ఫౌండేషన్ ఆర్థికసాయం

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలంలో గంభీరం పంచాయతీ స్వచ్ఛంద సంస్థ ఓఎస్‌జీ ఫౌండేషన్ చోడవరం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన జొన్నాడ నాగశంకరరావు భార్య శ్యామల కుటుంబానికి 10 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు. శ్యామల 6 నెలల గర్భిణిగా ఉన్న సమయంలో అత్యధిక రక్త స్రావం జరగడంతో వైజాగ్ కిమ్స్ ఐకాన్ హాస్పిటల్‌లో చేర్పించారు. శ్యామలకి ప్రాణ గండం ఉండటంతో ఆపరేషన్ చేయగా నెలలు నిండకుండానే కవలలు జన్మించారు. ఇద్దరు శిశువులు కిమ్స్ ఆసుపత్రిలోని ఎన్ఐసీయూలో ఉండడంతో ఫౌండేషన్ సభ్యులు 10 వేల రూపాయలు అందించారు. శిశువులకు "సర్‌ఫ్రాక్టెంట్ అడ్మినిస్ట్రేషన్" అవసరమని సుమారు 14 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారని బాధితులు వాపోయారు. దాతలు ఎవరైనా సాయంఅందించాలని కోరారు.

కన్వెన్షన్ సెంటర్ పనులు పరిశీలించిన ముమ్మన

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లి ప్రాంతంలో రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి చేతులు మీదుగా శంకుస్థాపన చేసిన కన్వెన్షన్ సెంటర్ స్లాబ్ పనులను స్థానిక కార్పొరేటర్ ముమ్మన దేముడు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు పాటించి పనులు క్రమ పద్ధతులో చేయాలని సూపర్వైజర్‌కు సూచించారు. వాటరింగ్ తప్పనిసరిగా చేయాలన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకుడు బొడ్డు దేముడుబాబు, సోషల్ మీడియా కన్వీనర్ కంచిబోయిన సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రయాన్-3 విజయవంతంతో సంబరాలు

విశాలాంధ్ర - అనంతగిరి: మండలంలోని కొత్తూరు కస్తూరిభా పాఠశాలలో చంద్రయాన్ -3 విజయోత్సవ సంబరాలను గురువారం నిర్వహించారు. విద్యార్థులకు చాక్లెట్లను పంచి వారితో విజయోత్సవ వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ శెట్టి నీలవేణి మాట్లాడుతూ చంద్రయాన్-2 విఫలమైనప్పటికీ అందులోని లోటుపాట్లను సరిదిద్దుకొని చంద్రయాన్ -3 విజయవంతంగా ఇస్రో ప్రయోగించడం భారతదేశ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేయడానికి కృషిచేసిన శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సారా సీతయ్య, పాత్రికేయులు చందు, ఎస్ఓ లత, ఉపాధ్యాయులు ప్రమీల రమాదేవి, మాధవి, సుబ్బలక్ష్మి ప్రీతి, భారతి, లక్ష్మి, భూలక్ష్మి కళ్యాణి, ఉష్శ్రీ, వెంకటలక్ష్మి, భారతి తదితరులు పాల్గొన్నారు.

ఎక్సేంజ్ కార్నివాల్ ప్రారంభించిన స్కోడా ఆటో

విశాలాంధ్ర - విశాఖ సిటీ: మోడల్ అప్డేట్‌లు, కస్టమర్ సర్వీస్ కార్యక్రమాలను కొనసాగిస్తూ, స్కోడా ఆటో ఇండియా ఆగస్టు 2023 ఎక్స్ఛేంజ్ కార్నివాల్ ను ప్రారంభించింది. ఈ కార్నివాల్ కొత్త స్కోడా కార్లను సొంతం చేసుకున్న వారి అనుభవాన్ని మరింత మెరుగుపరచడానికి కస్టమర్-స్నేహపూర్వక ఒప్పందాలు, డిస్కౌంటులు సర్వీస్, నిర్వహణ. మరియు వారంటీ ప్యాకేజీలను కలిగి ఉందని స్కోడా షోరూం ప్రతినిధి చెప్పారు. స్కోడాను కొనుగోలు చేయాలనుకునే వినియో గదారులకు విలువను గొప్ప యాజమాన్య అనుభవాన్ని అందించడమే ఎక్స్ఛేంజ్ కార్నివాల్ లక్ష్యం అన్నారు. ఎక్స్ఛేంజ్ కార్నివాల్ కింద, స్కోడా ఆటో ఇండియా రూ.60,000 వరకు ప్రయోజ నాలను, రూ.70,000 వరకు కార్పొరేట్ ప్రయోజనాలను అందిస్తోందని ఆయన తెలిపారు.

విద్యుత్ సమస్యలపై వినతి

విశాలాంధ్ర - దేవీపట్నం: గత కొంత కాలంగా దేవీపట్నం మండలంలో విద్యుత్ సరఫరాలో నెలకొంటున్న సమస్యలపై నియోజకవర్గ నేతలు ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత్ బాబులు ఎస్ ఈని కలసి విన్నవించటంతో విద్యుత్ శాఖ అధికారులు సానుకూలంగా స్పందించినట్లు మండల వైసిపీ నాయకులు తెలిపారు. ఈ మేరకు అయన సానుకూలంగా స్పందించి కోతలు లేకుండా చూస్తామని భరోసా ఇచ్చినట్టు తెలిసింది. కాగా గత కొంత కాలంగా ఈ సమస్య ప్రజలను పట్టి పీడిస్తుంది. అప్రకటిత కోతలతో రోజు అవస్థలు పడుతున్నారు. ఇది తెలుసుకున్న నియోజకవర్గం నేతలపై అధికారులతో మాట్లాడారని వైసీపీ నాయకులు తెలిపారు. ఎస్ఈని కలిసిన వారిలో ఎంపిపి కుంజం మురళీ, ఎస్ఈఎస్ కన్వీనర్ కందుల బాబ్జి, గారపాటి మురళీ కృష్ణ తదితరులు ఉన్నారు.

వృద్ధుడు అదృశ్యం



విశాలాంధ్ర - మాకవరపాలెం: వృద్ధుడు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు మాకవరపాలెం ఎస్సై రామకృష్ణారావు తెలిపారు. మండలంలోని జి.నగరం గ్రామానికి చెందిన ఒమ్మి రాములు(70) ఈ నెల 17న బ్యాంక్ పని నిమిత్తం సిలోని బ్యాంక్‌కు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లలేదన్నారు. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

బాలాజీ స్కూల్లో విద్యార్థుల మాక్ చంద్రయాన్

విశాలాంధ్ర - పెందుర్తి: చంద్రయాన్-3 విజయాన్ని పురస్కరించుకొని గోపాలపట్నం బాలాజీ పాఠశాల విద్యార్థులు మాక్ చంద్రయాన్ రాకెట్ తయారుచేసి అందంగా రంగోలితో ఇస్రో లోగోని తయారు చేసారు. త్రివర్ణ పతాకాన్ని విక్రమ్ ల్యాండర్ చందమామపై సుందరంగా అమర్చి ఇస్రో అని వరుస క్రమంలో విద్యార్థులను నిల్చోబెట్టారు. భారతమాతకి జై అని నినాదాలతో పిల్లలు హోరెత్తించారు. దీంతో పాఠశాలలో పండగ వాతావరణం కనిపించింది. ఈ కార్యక్రమం కోఆర్డినేటర్ పి రామకృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించగా స్కూల్ ప్రిన్సిపల్ హేమ, వైస్ ప్రిన్సిపల్ శశి లకు స్కూల్ యాజమాన్యం ప్రత్యేకంగా అభినందనలు తెలిపింది.

అర్హత ఉన్న వారందరికీ నవరత్నాలు అమలు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: రాష్ట్రవ్యాప్తంగా అర్హులై ఉండి వివిధ కారణాలతో సంక్షేమ పథకాలు పొందని వారికి ద్వైవార్షిక నగదు మంజూరు కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి గురువారం ఉదయం ప్రారంభించారు. డిసెంబర్ 2022 నుండి జూలై 2023 వరకు అమలైన సంక్షేమ పథకాలు సాంకేతిక, ఇతర కారణాలతో లబ్ధిపొందని 2 లక్షల 62 వేల 169 మంది అర్హులకు రూ.216.34 కోట్లను బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాల్లో జమచేశారు. వీరితో పాటు కొత్తగా 2022 డిసెంబర్ నుండి 2023 జూలై వరకు అర్హులైన మరో ఒక లక్ష 49వేల 875 మందికి పింఛన్లు, 4వేల 327 మందికి ఆరోగ్యశ్రీ కార్డులు, 2లక్షల 312 మందికి రేషన్ కార్డులు, 12వేల 69 మందికి ఇళ్ల పట్టాలను కూడా నేడు జగనన్న ప్రభుత్వం అందిస్తున్నట్లు చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సోషల్ అడిట్ కోసం గ్రామ,వార్డు సచివాలయాల్లో లబ్ధిదారుల జాబితాలను ప్రదర్శించి, పారదర్శకతతో పంపిణీ చేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఎక్కడా లంచాలకు తావులేకుండా కుల,మత,వర్గ,పార్టీల వివక్షకు తావులేకుండా, కేవలం అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ నూటికి నూరు శాతం సంతృప్తి స్థాయిలో అమలుచేసే దిశగా పథకాల లబ్ధిని అందిస్తున్న ప్రభుత్వం మనదన్నారు. జిల్లా స్థాయిలో ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయ వీడియో సమావేశ మందిరంలో వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.ఏ.మల్లికార్జున మాట్లాడుతూ నవరత్నాల్లో భాగంగా సంక్షేమ పథకాలు అర్హత కలిగి లబ్ధిపొందని లబ్దిదారులకు జిల్లాలో 7వేల 14మంది లబ్దిదారులకు రూ.8.84 కోట్లు జమచేస్తున్నట్లు చెప్పారు. ఇందులో అమ్మఒడి పథకం క్రింద ఒక్కొక్క లబ్దిదారునికి రూ.15 వేలు చొప్పున 593 మందికి రూ 88.95 లక్షలు, చేదోడు పథకం క్రింద ఒకొక్కరికి రూ.10వేలు వంతున 2వేల 668మంది లబ్దిదారులకు రూ.2.66 కోట్లు, ఇబిసి నేస్తం క్రింద రూ.15వేలు చొప్పున 241 మందికి రూ.36.00 లక్షలు, మత్స్యకార భరోసా క్రింద రూ.10వేలు చొప్పున 11 మందికి రూ 11.00 లక్షలు , వసతి దీవెన పథకం క్రింద 1,293 మంది లబ్దిదారులకు రూ.1.12 కోట్లు, విద్యా దీవెన క్రింద 2,194 మందికి రూ.3.78 కోట్లు, వ్యవసాయం క్రింద 14 మంది లబ్దిదారులకు రూ.70 వేలు లబ్దిదారుల వ్యక్తిగత ఖాతాలో జమచేయడం జరిగిందన్నారు. అనంతరం నమూనా చెక్కును ప్రజా ప్రతినిధులతో కలిసి లబ్దిదారులకు ఈ సందర్భంగా కలెక్టర్ అందజేశారు. ఈ సమావేశానికి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జె.సుభద్ర, జివియంసి కమీషనర్ సియం సాయికాంత్ వర్మ, గాజువాక నియోజకవర్గ శాసనసభ్యులు తిప్పల నాగిరెడ్డి, దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, నెడ్ క్యాప్ ఛైర్మన్ కె.కె.రాజు, వార్డు,గ్రామ సచివాలయాల జిల్లా ఇంచార్జ్ పూర్ణిమ దేవి, ఇతర అధికారులు, విద్యార్థులు, తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అక్టోబరు నెలాఖరు నాటికి భవన నిర్మాణాలు పూర్తి చేయండి

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణాలను త్వరితిగతిన నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఐటిడిఏ పిఓ వి.అభిషేక్ ఆదేశించారు. గురువారం ఆయన కార్యాలయంలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులతో అరుకు నియోజక వర్గంలో జరుగుతున్న గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, అంగన్వాడీ భవన నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్నతా భవన నిర్మాణాలు ప్రాధాన్యేతర పనులు చేస్తున్న కాంట్రాక్టర్లకు అప్పగించి సెప్టెంబరు నెలాఖరు నాటికి కొన్ని, అక్టోబరు నెలాఖరు నాటికి కొన్ని భవనాల నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రాధాన్యేతర పనులు చేస్తున్న కాంట్రాక్టర్లకు ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణపు పనులు అప్పగించి వేగంగా పూర్తి చేయాలని అరకు గిరిజన సంక్షేమ శాఖ ఇ ఇని ఆదేశించారు. ప్రాధాన్యేతర పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు భవన నిర్మాణాలు చేయడానికి ముందుకు రాకపోతే ప్రాధాన్యేతర పనులు బిల్లులు నిలుపుదల చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ ఇ ఇ టి.కొండయ్య పడాల్,పి ఐ యు ఇ ఇ కె.లావణ్య కుమార్, డి.ఇ. రామం ఎ ఈ ఈలు తదితరులు పాల్గొన్నారు.

స్థాయి సంఘం సమావేశంలో అన్ని అంశాలు ఆమోదం

మేయర్ గొలగాని హరి వెంకట కుమారి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ స్థాయి సంఘ సమావేశం గురువారం స్టాండింగ్ కమిటీ చైర్పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి అధ్యక్షతన జివిఎంసి స్థాయి సంఘ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ స్థాయి సంఘం అజెండాలో 30 అంశాల తో పాటు 3 టేబుల్ అజెండాలను పొందుపరిచారని, అందు అన్ని అంశాలు సభ్యులు చర్చించి ఆమోదం తెలిపారని చైర్పర్సన్ తెలిపారు. ఇంజనీర్ విభాగానికి సంబంధించి సుమారు రూ.333.51 లక్షల పనులకు, ప్రజారోగ్య విభాగానికి సంబంధించి సుమారు రూ.140 లక్షలు ఆమోదం తెలిపారని, రెవెన్యూ విభాగానికి చెందిన లీజులు పొడిగింపులు, ఉద్యోగుల సర్వీస్‌కు సంబంధించిన అంశాలతో పాటు ఇతర అంశాలను ఆమోదించారన్నారు. ఈ సమావేశంలో స్థాయి సంఘ సభ్యులతో పాటు ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, డిసి(రెవెన్యూ) ఫణిరామ్, కార్యదర్శి వి.నల్లనయ్య, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి,, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్, జెడి అమృత్ భారతి కార్యనిర్వాహక ఇంజనీర్లు, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ఏయూతో ఐసిటి అకాడమి ఎంఓయూ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆంధ్రవిశ్వవిద్యాలయంతో ఐసిటి అకాడమి అవగాహన ఒప్పందం చేసుకుంది. బుధవారం ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత సమక్షంలో ఒప్పంద పత్రాలపై ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఐసిటి అకాడమి సిఈఓ హరి బాలచంద్రన్‌లు సంతకాలు చేసారు. ఈ అవగాహన ఒప్పందంలో భాగంగా ఐసిటి అకాడమీకి నోడల్ కేంద్రంగా ఏయూ నిలవనుంది. అదే విధంగా ఏయూ ఆచార్యులకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్-కమ్యూనికేషన్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ విభాగాలలో అవసరమైన సేవలను అందిస్తుంది. పరిశ్రమల అనుసంధానితంగా శిక్షణ కార్యక్రమాలను ఐసిటి అకాడమి నిర్వహిస్తుంది. ఈ సేవలను ఏయూతో పాటు అనుబంధ కళాశాలల అధ్యాపకులు సైతం పొందే అవకాశం ఉంది. అదే విధంగా ఏయూ ఆచార్యులు పరిశోధన పత్రాలను ఐటిసి జర్నల్స్‌లో ప్రచురిస్తారు. కార్యక్రమంలో ఏయూ అలుమ్ని అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఇ.శంకర రావు, మీడియా రిలేషన్స్ డీన్ ఆచార్య చల్లా రామకృష్ణ, ఐసిటి అకాడమి స్టేట్ హెడ్ దినకర్ రెడ్డి, రీజినల్ మేనేజర్ బి.ప్రవీణ్ కుమార్, ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ అత్యుత్తమ నైపుణ్యాలను అధ్యాపకులకు, విద్యార్థులకు అందించే దిశగా ఈ అవగాహన ఒప్పందం ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు.

ఏయూతో అమృత సంస్థ ఎంఓయూ

ఆంధ్రవిశ్వవిద్యాలయంతో అమృత సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంది. బుధవారం ఒప్పంద పత్రాలపై ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత సమక్షంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అమృత సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ ఏ.ఇందుమణిలు సంతకాలు చేసారు. అవగాహన ఒప్పందంలో భాగంగా ఏయూ సూచించిన విధంగా ఏడాది కాలవ్యవధితో పిజి డిప్లమా ఇన్ యోగా, ఆరు నెలల కాలవ్యవధితో డిప్లమా ఇన్ యోగా కోర్సులను అమృత సంస్థ నిర్వహిస్తుంది. కార్యక్రమంలో యోగా కేంద్రం సంచాలకులు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు భానుకుమార్, విభాగాధిపతి డాక్టర్ కె.రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 10న దళిత విముక్తి ఆధ్వర్యంలో ప్రతిఘటనా సదస్సు, ర్యాలీ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: దళిత విముక్తి 25 ఏళ్ల ఉద్యమ ప్రస్థానం నేపథ్యంలో సెప్టెంబర్ 10న ప్రతిఘటనా సదస్సు, ఊరేగింపులను జరపనున్నామని దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ తెలిపారు. నగరంలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద గురువారం జరిగిన ప్రెస్ మీట్ లో కార్యక్రమ పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలోని ఆర్ అండ్ బి దగ్గర గల అంబేద్కర్ భవన్ లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆరోజు ఉదయం 10 గంటలకు ప్రతిఘటనా సదస్సు, సాయంత్రం 4 గంటలకు సభా స్థలం నుండి ఎన్ఏడి కొత్త రోడ్డు వరకు ఊరేగింపు జరుగుతుందని చెప్పారు. కార్యక్రమానికి వక్తలుగా మాజీ యూపీఎస్సీ సభ్యుడు, పూర్వ ద్రావిడ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. ఎస్ ,చలం ,ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ పి.డి. సత్యపాల్, తెలంగాణ విద్యావంతుల వేదిక అధ్యక్షుడు అంబాటి నాగయ్య తదితరులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలు జిల్లాల నుండి దళిత, బహుజనులు తరలిరాబోతున్నారని తెలిపారు.గత 25 ఏళ్లుగా దళిత విముక్తి కులనిర్మూలన,మతోన్మాదం, దళితులపై దాడులు, భూమి సమస్య, తదితర అంశాలపై పోరాడుతుందని వివరించారు. దేశానికి మూలవాసులు ,సంపద సృష్టికర్తలైన దళిత ,బహుజనులకు ఆ సంపద మీద అధికారం లేకుండా పోయిందని చెప్పారు. వేల సంవత్సరాలుగా దళితులపై దాడులు,కుల అణచివేత జరుగుతూనే ఉన్నాయన్నారు.ప్రాచీన నాగరికతకు మూలధారమైన సింధూ నాగరికత వారసులు దళిత, ఆదివాసీ, బహుజనులేనని మధ్య ఆసియా నుండి వలస వచ్చిన ఆర్యులు అభివృద్ధి కరమైనసింధూ నాగరికతను ధ్వంసం చేసి మనువాదానికి బీజాలు నాటారన్నారు. దళిత హక్కుల సమాఖ్య అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటరమణ మాట్లాడుతూ అన్నిసమానతలకు మూలం మనువాదమేనని అంబేద్కర్ ఉద్యమస్ఫూర్తితో దళిత విముక్తి అసమానతలకు వ్యతిరేకంగా అనేక సమస్యలపై పోరాడుతుందని ప్రతిఘటనా పోరాటంలోకి ప్రజలందరినీ సమీకరిస్తుందని చెప్పారు. దళితులపై దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయని వాటిని అదుపు చేయాల్సిన ప్రభుత్వాలు హంతకుల పక్షమే వహిస్తున్నారని దుయ్య పట్టారు. 1991లో చుండూరు దళితులపై జరిగిన మారణకాండలో ఇప్పటివరకు న్యాయం జరగలేదని మండిపడ్డారు. భారత రాజ్యాంగంలోని లౌకికవాదం ప్రకారం మతం వ్యక్తిగతమైందని కానీ బిజెపి ,ఆర్ఎస్ఎస్ ,దాని అనుబంధ సంఘ పరివార్ సంస్థలు హిందూ మతోన్మాదాన్ని ప్రజలపై రుద్దుతూ మైనారిటీలు,దళితులు,ఆదివాసీలు, మహిళలపై దాడులకు ఉసిగొలుగుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే గతంలో గుజరాత్ ,నేడు మణిపూర్ దారుణాలు చోటుచేసుకున్నాయని తెలిపారు. మరో ప్రతినిధి బి .సన్యాసమ్మ మాట్లాడుతూ కల్బుర్గి, గౌరీ లంకేష్, నరేంద్ర దభోల్కర్ లను మనువాదులు హతమార్చారన్నారు.భారత రాజ్యాంగాన్ని మార్చేసే కుట్ర సాగుతుందని, ప్రైవేటీకరణ ద్వారా రిజర్వేషన్లను గండి కొడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం 28 ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన సంక్షేమ పథకాలను రద్దు చేయడం దారుణమని తక్షణమే వాటిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రజా చైతన్యం, ప్రతిఘటనతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కే.రవి ,యు శివ, కె.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిష్కారాలను అందించేందుకు

టాటా ఏఐఏ ప్రోఫిట్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: భారతదేశంలోని ప్రముఖ జీవిత బీమా కంపెనీలలో ఒకటైన టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ (టాటా ఏఐఏ లైఫ్) ఒకరి ప్రత్యేక అవసరాలను తీర్చే వినూత్నమైన మరియు వ్యక్తిగతీకరించిన ఆరోగ్య పరిష్కారమైన టాటా ఏఐఏ ప్రో-ఫిట్‌ను ప్రారంభించింది. ఈ అసాధారణమైన ప్లాన్ ఒకరి వైద్య ఖర్చులు, ఆరోగ్యం వెల్నెస్ ప్రయోజనాల కోసం సమగ్ర కవరేజీని అందిస్తుంది మరియు సంపద సృష్టికి అవకాశాన్ని అందిస్తుంది, ఇది ఆరోగ్య అత్యవసర నిధిగా తోడ్పడుతుంది. టాటా ఏఐఏ యొక్క ప్రో-ఫిట్ ఈ దిగువ ప్రయోజనాలను కలిగి ఉంది. 130 కంటే ఎక్కువ శస్త్రచికిత్సలు, డేకేర్ విధానాలు మరియు 57 క్లిష్టమైన అనారోగ్యాల కోసం కవర్.భారతదేశంలోని నెట్‌వర్క్ ఆసుపత్రులలో నగదు రహిత క్లెయిమ్ సేవలను పొందవచ్చు. రోగనిర్ధారణ పరీక్షల కోసం రూ.25,000 వరకూ రీయింబర్స్‌మెంట్, ఓవర్సీస్ ట్రీట్‌మెంట్ బూస్టర్ రూ.10,00,000 వరకు అదనపు ప్రయోజనాలను చెల్లిస్తుంది. మహిళలు, యువత తమ ఆరోగ్యం కోసం పెట్టుబడి పెట్టడాన్ని ప్రోత్సహించడానికి ప్రత్యేక ప్రయోజనాలు.ట్రాన్స్‌జెండర్లకు 'ప్రైడ్' తగ్గింపు టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రెసిడెంట్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ సమిత్ ఉపాధ్యాయ్ మాట్లాడుతూ "క్లిష్టమైన అనారోగ్యం ఏ వయసులోనైనా సంభవించవచ్చు. పూర్తిగా చికిత్స చేసినప్పటికీ, అనేక రకాల వ్యాధులు తిరిగి సంభవించవచ్చు.

అవి గణనీయంగా ఆర్థిక నష్టాన్ని కలిగిస్తాయి.భారతదేశంలో మొత్తం ఆరోగ్య వ్యయంలో 65% జేబు నుంచి ఖర్చు చేస్తున్నదే అనేది వాస్తవం. టాటా ఏఐఏ ప్రో-ఫిట్ హెల్త్ ప్లాన్ మీరు ఎంచుకున్న వ్యవధి వరకు లేదా మీ జీవితాంతం వరకు మీకు కవరేజీని అందించడానికి రూపొందించబడింది" అని అన్నారు.

మెనూ అమలులో నిర్లక్ష్యం తగదు

గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: విద్యార్థులకు పెట్టే భోజన మెనూను సక్రమంగా అమలు చేయాలని దుంబ్రిగుడ హెచ్‌డబ్ల్యుఓపై కఠిన చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం అల్లూరి జిల్లా ఉపాధ్యక్షుడు టి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మెనూ అమలు కాకపోవడం వల్ల విద్యార్థులకు పౌష్టికాహారం అందని పరిస్థితి నెలకొంటుందన్నారు. హెచ్‌డబ్ల్యుఓ స్థానికంగా ఉంటూ విద్యార్థుల సంరక్షణ చూసుకోవలసిన బాధ్యత ఉందని, అయితే ఇక్కడి హెచ్ డబ్ల్యు ఓ స్థానికంగా ఉండకపోవడంతో విద్యార్థులకు రాత్రివేళల్లో సమస్యలు వచ్చినప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆశ్రమ పాఠశాల వసతి గుహల్లో విద్యార్థులకు పెడుతున్న భోజన మెనూ సక్రమంగా అమలు జరిగే విధంగా పర్యవేక్షించాల్సిన ఆ శాఖ మండల స్థాయి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఈ ఒక్క పాఠశాలలోనే కాకుండా మండలంలో ఉన్న అన్ని ఆశ్రమ పాఠశాలల్లో ఇదే పరిస్థితి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. తక్షణమే మెనూ అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్న వార్డెన్లపై చర్యలు తీసుకుని, విద్యార్థులకు సక్రమంగా మెనూ పెట్టే విధంగా ఉన్నతాధి కారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థులతో ఆందోళన చేయాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

శ్రావణం శోభతో పువ్వుల ధరలకు రెక్కలు

విశాలాంధ్ర - ఆనందపురం: వేములవలస మహాత్మా గాంధీ రోజువారి పువ్వులు మార్కెట్ ఉత్తరాంధ్రకే మంచి విశిష్టత కలిగినటువంటి మార్కెట్ లక్ష్మివారం మహిళలతో కిక్కిరిసి పోయింది. శ్రావణమాసం వచ్చిందంటే చాలు పువ్వుల ధరలకు అమాంతంగా రెక్కలు వచ్చేస్తాయి అప్పటివరకు సాధారణ స్థాయిలో ఉన్న రేటు శ్రావణమాసంలో అమాంతంగా పెరిగిపోయి పూజకు పువ్వులు కొనుక్కోలేని పరిస్థితి భక్తులకైతే ఎదురవుతుంది శ్రావణమాసం పురస్కరించుకొని రెండో శుక్రవారం సందర్భంగా మార్కెట్లో ఉన్న పువ్వులకు మంచి ప్రత్యేకత ఉంది. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పువ్వుల కొరకు నేరుగా నగర వాసులతో పాటు అందరూ ఇక్కడికి వచ్చి పువ్వులను కొనుక్కుంటారు కానీ శ్రావణమాసం సందర్భంగా పువ్వులు ధరలు అమాంతంగా పెరిగిపోయి పువ్వుల సామాన్య భక్తులకు దొరకలేని పరిస్థితి నెలకొంది. కిలో కనకంభరం 3000, మల్లి పువ్వులు 2000 ,జాజులు 1500 చామంతి 500, గులాబీ 500 ధర పలికింది. సాధారణ రోజుల్లో కనకంబరాలు కిలో 500, మల్లీ 400, చామంతి 150, గులాబీ 100 రూపాయలు ఉండగా శ్రావణమాసం రోజు అమాంతంగా 5 రేట్లు పెరగడంతో పువ్వులు కొనలేని పరిస్థితి నెలకొంది. దీంతో మహిళల పూజకు కావలసిన పువ్వులకు అధిక ఖర్చు హెచ్చించవలసి వచ్చింది. ఆనందపురం మార్కెట్లో సుమారు 40 షాపులు పూలు వ్యాపారస్తులు ఉన్నారు. సాధారణ రోజుల్లో లక్షలో వ్యాపారం జరిగితే శ్రావణమాసం కోట్లలో వ్యాపారం జరుగుతుంది. రేట్లు అదుపులో లేకపోవడంతో వ్యాపారస్తులు ఇష్టం సారంగా అధిక రేట్లకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. కోట్లాది రూపాయలు వ్యాపారం జరిగి అనందపురం మార్కెట్లో నిర్దిష్టమైన రేట్లను అమలు చేసి, స్థానిక మార్కెట్లో రేట్లు యొక్క బోర్డులను ఏర్పాటు చేసి వ్యాపారాలు సాగించినట్లయితే మరింత ఎక్కువగా పూల మార్కెట్ కు కొనుగోలుదారులు పెరుగుతారు. ఈ విషయమై అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అసెంబ్లీ స్పీకర్ తమ్మినేనికి ఘన స్వాగతం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాజస్థాన్ రాష్ట్రం ఉదయ్ పూర్‌లో జరిగిన కామన్ వెల్త్ అసోసియేషన్ సమావేశాలు ముగించుకొని గురువారం విశాఖ విమానాశ్రయానికి చేరుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాంకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం శాలువాతో సత్కరించి పుష్ప గుచ్ఛాన్ని అందించి అభినందనలు తెలిపారు. అనంతరం రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం మాట్లాడుతూ దేశాభివృద్ధికి, రాష్ట్రాభివృద్ధికి ఎన్నో కీలక అంశాలు చర్చకు రావడం శుభ పరిణామం అన్నారు. చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం అల్లూరి సీతారామరాజు జిల్లా కన్వీనర్ డాక్టర్ బాకా లవకుశ, విశాఖ జిల్లా కన్వీనర్ కారి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

డొంకపుట్టుకు పాఠశాల భవనం కరువు

విశాలాంధ్ర - అనంతగిరి: మండలంలో గల మారుమూల డొంక పుట్టు పాఠశాలకు భవనం కరువైందని మాజీ సర్పంచ్ గిరిజన సంఘం మండల శాఖ అధ్యక్షుడు సివేరి కొండలరావు అన్నారు. ఈ గ్రామంలో సుమారు 67 మంది విద్యార్థులు పాఠశాలకు వెళ్తున్నారని వీరంతా కూడా పాఠశాలకు భవనం లేకపోవడంతో మట్టి గోడలతో నిర్మించిన చిన్న గదిలోనే విద్యను అభ్యసిస్తున్నారని ఆయన చెప్పారు. గతంలో పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతులు సమర్పించినా ప్రయోజనం శూన్యమన్నారు. గతంలో పాఠశాల భవనం మంజూరు అయిందని కొద్దిపాటి గోడలు నిర్మించి సగంలో వదిలేశారని మరల గత ఏడాది నాడు నేడులో ఎంపికైందని పనులు ప్రారంభించకుండా వదిలేశారని ఆయన ఆరోపించారు. ప్రస్తుత వర్షాకాలంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ దీనిపై దృష్టి సారించి పనులు జరిగేందుకు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

ఐజేయూ జాతీయ అధ్యక్షుల్ని కలిసిన జిల్లా అక్రిడేషన్ మెంబర్ చంద్రరావు

విశాలాంధ్ర - నక్కపల్లి: హైదరాబాద్ టియు డబ్ల్యూజె యూనియన్ నూతన కార్యాలయ భవనంలో ఐజెయు జాతీయ అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, టియుడబ్ల్యూజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరాత్ అలీ జిల్లా అక్రిడేషన్ మెంబర్ కోరాడ చంద్రరావు మర్యాద పూర్వకంగా కలిసి, జిల్లాలో ఉన్న జర్నలిస్టుల సమస్యలను తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు ఎ.రామకృష్ణరాజు తదితరులు ఉన్నారు.

నేటి నుంచి జిల్లాలో నేత్రదాన పక్షోత్సవాలు



విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: ఈ నెల 25 తారీకు నుండి 8వ తారీకు సెప్టెంబర్ వరకు 38వ జాతీయ నేత్ర దాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ చేతులమీదుగా గోడపత్రిక విడుదల చేశారు. ఈ మేరకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ విశ్వేశ్వర నాయుడు జిల్లా వ్యాప్తంగా ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో వైద్యాధికారి సహకారం తో అవగాహన ర్యాలీ నిర్వహించాలని పిలుపునిచ్చారు. మరిన్ని వివరాలకు 924662400 ఫోన్ నెంబర్ లో సంప్రదించాలని సూచించారు.

మాజీ సైనికునికి పరామర్శ

విశాలాంధ్ర - పద్మనాభం: భీమిలి నియోజకవర్గం పద్మనాభం మండలం రేవిడి గ్రామ పంచాయతీలో కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని సర్పంచ్ కుమారుడు వైఎస్సార్సీపీ నాయకుల భూ ఆక్రమణలపై ఇటీవల వైజాగ్ కలెక్టర్ వారి కార్యాలయం స్పందనలో ఫిర్యాదు చేశాడనే కక్షతో మాజీ జవాన్‌పై హత్యా ప్రయత్నం చేసి గాయాలపాలు చేసి హాస్పిటల్లో చికిత్స పొందుతున్న మాజీ సైనికుడు ఆదినారాయణను జనసేన పార్టీ భీమిలి నియోజకవర్గ ఇంచార్జి డా. సందీప్ పంచకర్ల పరామర్శించారు. ఈ కార్యక్రమంలో చంద్రరావు, అక్కరమాని దివాకర్, కృష్ణయ్య, గుడివాడ కిరణ్ శంకర్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

108 వాహన పైలట్లకు, డ్రైవర్లకు సాంకేతిక శిక్షణ

విశాలాంధ్ర - చోడవరం : అనకాపల్లి జిల్లా 108 వాహనం డ్రైవర్లు మరియు పైలట్లకు సాంకేతిక నైపుణ్యంపై చోడవరం ప్రభుత్వ ఆసుపత్రి లో గురువారం ఒకరోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డ్రైవింగ్ లో మెళుకువలు, ఆపద సమయంలో పైలెట్లు తీసుకోవలసిన జాగ్రత్తలు, అవసరాలు, రోగిని ప్రాణాపాయ స్థితి నుండి కాపాడేందుకు చేపట్టవలసిన చర్యలు, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. అలాగే 108 వాహన విధుల్లో ఏర్పడే సమస్యలు తదితర అంశాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో జోనల్ ఫ్లీట్ మేనేజర్ రవికిరణ్ గారు, జిల్లా మేనేజర్ త్రినాధ్ గారు., ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ నాగేశ్వరరావు గారు పాల్గొన్నారు.

మారియట్ బోన్‌వాయ్‌తో హెచ్‌డిఎఫ్‌సి ఎంఓయూ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: భారతదేశంలోని ప్రముఖ ప్రైవేట్ రంగ బ్యాంకు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, మారియట్ ఇంటర్నేషనల్ అవార్డు గెలుచుకున్న ట్రావెల్ ప్రోగ్రామ్ మారియట్ బోన్‌వాయ్‌తో చేతులు కలిపి, భారతదేశపు మొట్టమొదటి కో-బ్రాండెడ్ హోటల్ క్రెడిట్ కార్డ్ 'మారియట్ బోన్‌వాయ్ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ క్రెడిట్ కార్డ్'ను విడుదల చేసింది. ఈ కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డ్ డిస్కవర్ గ్లోబల్ నెట్‌వర్క్‌లో భాగమైన డైనర్స్ క్లబ్ ద్వారా పని చేస్తుందనీ ఆ బ్యాంకు మేనేజర్ చెప్పారు. భారతదేశంలో అత్యంత రివార్డింగ్ ట్రావెల్ కార్డ్‌లలో ఒకటిగా ఉండాలనే లక్ష్యాన్ని ఇది కలిగి ఉందన్నారు. మారియట్ బోన్‌వాయ్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ కార్డ్ రెండు బ్రాండ్‌ల బలాన్ని ఒక్క చోటుకు చేర్చుతుందన్నారు. వినియోగదారులకు మారియట్ బోన్‌వాయ్‌తో సిల్వర్ ఎలైట్ స్టేటస్‌తో సహా అపూర్వమైన ప్రయాణ ప్రయోజనాలను అందిస్తోందని వివరించారు.

బొర్రా-బాకూరులో కనీస సౌకర్యాలు కరవు

విశాలాంధ్ర - హుకుంపేట: మండలం కొట్నాపల్లి పంచాయతీ బొర్రబాకూరు గ్రామంలో కనీస సౌకర్యాలు కరువయ్యాయని మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు సిద్ది రి రాధా లక్ష్మి ఆరోపించారు. గురువారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఆమె మాట్లాడుతూ పి వి టి జి గ్రామాలలో ఆదిమ జాతి గిరిజనులకు ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని చెబుతున్న పాలకులు సైతం గ్రామాలపై సీత కన్ను వేయడం తగదన్నారు. గ్రామంలో కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయన్నారు. గ్రామంలో గర్భిణీ స్త్రీలకు బాలింతలకు పిల్లలకు పౌష్టికాహారం అందించే అంగన్వాడి కేంద్రం భవనం, పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పే పాఠశాల భవనం సైతం అసంపూర్తిగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గ్రామంలో కనీసం మంచినీరు దొరకక పొలాల్లో ఉన్న కలుషిత ఊటనీరు త్రాగి గ్రామంలో అనేక వ్యాధులకు గురవుతున్నారని తెలిపారు. గ్రామంలో ఎవరికైనా జబ్బు చేసినప్పుడు 108 వాహనం రావడానికి కనీస రహదారి కూడా లేదన్నారు. ఇప్పటికైనా తక్షణమే స్పందించి ప్రజా ప్రతినిధులు అధికారులు కనీస సదుపాయాలు కల్పించకపోతే ఆందోళన బాట పట్టక తప్పదని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోకాంగ్రెస్ పార్టీ నాయకులు సిదరిమంగరాజు, రేగం కమలాకర్ ,కిలో సిద్దు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై జెడ్పీ చైర్‌పర్సన్‌కు వినతి



విశాలాంధ్ర - హుకుంపేట: పంచాయతీ పలు గ్రామాల్లో మంచి నీరు సమస్య, డ్రైనేజ్ కాలువలు, సీసీ రోడ్‌లు నిర్మాణం కొరకు నిధులు కేటాయించాలని ఉమ్మడి విశాఖపట్నం జిల్లా, జిల్లా పరిషత్ చైర్మన్ జల్లిపల్లి సుభద్రను విశాఖపట్నం లో గల తన గృహము లో బుధవారం పంచాయతీ సర్పంచ్ సమిడ వెంకట పూర్ణిమ మర్యాద పూర్వకంగా కలిసి హుకుంపేట పంచాయతీ లో గల సమస్య లు ను గూర్చి విన్నవించామని తెలిపారు. వీటిపై చైర్మన్ సానుకూలంగా స్పందించారని అని తెలిపారు.